సాక్షి
జగిత్యాల
మంగళవారం ● 4 ● జూలై ● 2023



ఆది దేవునికి వందనం

వేములవాడ: రాజన్నను సోమవారం 15 వేల మంది భక్తులు దర్శించుకున్నారు. పూజలు చేసి మొక్కులు చెల్లించుకున్నారు.



ఎడ్ల నాగలికి గిరాకీ

జగిత్యాల అగ్రికల్చర్: ప్రస్తుతం వ్యవసాయ రంగంలో ఎడ్ల నాగలి కలిగిన రైతులకు మంచి గిరాకీ లభిస్తోంది.

- 8లో▸

వాతావరణం

గరిష్టం/కనిష్టం
34.0/27.0

ఆకాశం మేఘావృతమై ఉంటుంది. జిల్లాలోని కొన్నిచోట్ల ఉరుములు, మెరుపులతో కూడిన వర్షం కురిసే అవకాశం ఉంది.

న్యూస్‌రీల్

అన్ని అంశాలపై అవగాహన అవసరం



మాట్లాడుతున్న జస్టిస్ చంద్రయ్య

జగిత్యాలజోన్: సమాజంలో ప్రతీఅంశంపై న్యాయవాదులు లోతైన అవగాహన కలిగి ఉండాలని హైకోర్టు రిటైర్డ్ జడ్జి, రాష్ట్ర మానవ హక్కుల కమిషన్ మాజీ చైర్మన్ చంద్రయ్య సూచించారు. జగిత్యాల బార్ అసోసియేషన్ ఆధ్వర్యంలో సోమవారం జస్టిస్ చంద్రయ్యను సన్మానించారు. జస్టిస్ చంద్రయ్య మాట్లాడుతూ, భారత రాజ్యాంగానికి పేరు ప్రఖ్యాతులు ఉన్నాయని పేర్కొన్నారు. సామాన్యులకు చట్టాల గురించి తెలియక మోసపోతున్నారని, వాటి గురించి తెలియజేయాలని కోరారు. మారుతున్న సమాజంలో వచ్చే లోకం పోకడలను పసిగట్టాలని సూచించారు. ఈ కార్యక్రమంలో జిల్లా ప్రధాన న్యాయమూర్తి నీలిమ, మొదటి అదనపు జిల్లా సెషన్స్ జడ్జి నారాయణ, బార్ అసోసియేషన్ అధ్యక్షుడు కాటిపెల్లి శ్రీపాల్‌రెడ్డి, ప్రధాన కార్యదర్శి చీటి రామకృష్ణారావు, కోశాధికారి కటుకం చంద్రమోహన్, న్యాయవాదులు తదితరులు పాల్గొన్నారు.

34వేల క్వింటాళ్ల మక్కల సేకరణ



దివ్యభారతి

ఇబ్రహీంపట్నం(కోరుట్ల): జిల్లాలో ఏర్పాటుచేసిన 12 కొనుగోలు కేంద్రాల ద్వారా 839 మంది రైతుల నుంచి 34,061.50 క్వింటాళ్ల మక్కలు సేకరించామని మార్క్‌ఫెడ్ డీఎం దివ్యభారతి సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. వీటివిలువ రూ.6,68,28,663 ఉంటుందని వివరించారు. ఇబ్రహీంపట్నంలో 10,098 క్వింటాళ్లు, మల్లాపూర్‌లో 3,721 క్వింటాళ్లు, జగిత్యాలలో 843 క్వింటాళ్లు, రాయికల్‌లో 8,012.50క్వింటాళ్లు, కోరుట్లలో 90.50 క్వింటాళ్లు, గొల్లపల్లిలో 5,153 క్వింటాళ్లు, రేచపల్లిలో 3,342 క్వింటాళ్లు, వెల్గొండలో 2,801.50 క్వింటాళ్లు కొనుగోలు చేసినట్లు వివరించారు. ధర్మపురి, బీర్పూర్, మేడిపల్లి, కథలాపూర్ కొనుగోలు కేంద్రాలకు మక్కలు విక్రయించేందుకు రాలేదన్నారు. మక్కలు విక్రయించిన రైతుల బ్యాంకు ఖా తాల్లోడబ్బులు జమచేసినట్లు ఆమె పేర్కొన్నారు.

'ఎల్లంపల్లి'లో చేపల వేట నిషేధం

జగిత్యాలఅగ్రికల్చర్: జిల్లాలోని గోదావరినదితోపాటు, ఎల్లంపల్లి ప్రాజెక్ట్ బ్యాక్ వాటర్‌లో చేపల వేటను ఈనెల 1 నుంచి ఆగస్టు 31వ తేదీ వరకు నిషేధించినట్లు జిల్లా మత్స్యశాఖ అధికారి దామోదర్ సోమవారం తెలిపారు. జూలై, ఆగస్టు నెలల్లో చేపలు గుడ్లు పెట్టి సంతానం ఉత్పత్తి చేస్తాయని, అందుకే ఈ రెండు నెలలపాటు చేపల వేటను నిషేధించామని వివరించారు. నిబంధనలు అతిక్రమిస్తే చర్యలు తీసుకుంటామని ఆయన హెచ్చరించారు.

కోరుట్ల ఆర్డీవో బదిలీ



వినోద్‌కుమార్

కోరుట్లరూరల్: కోరుట్ల రెవెన్యూ డివిజనల్ అధికారి(ఆర్డీవో) టి.వినోద్ కుమార్ బదిలీ అయ్యారు. ఆయనను ఆర్మూర్ ఆర్డీవోగా బదిలీ చేస్తూ ప్రభుత్వం సోమవారం ఉత్తర్వులు జారీచేసింది.

జూనియర్ లెక్చరర్ల సంఘం నూతన కార్యవర్గం

జగిత్యాల: తెలంగాణ ప్రభుత్వ కళాశాలల జూనియర్ లెక్చరర్ల సంఘం-475 జిల్లా నూతన కార్యవర్గాన్ని సోమవారం ఎన్నుకున్నారు. సంఘం జిల్లా అధ్యక్షుడిగా కొట్టాల తిరుపతిరెడ్డి, ప్రధాన కార్యదర్శిగా అత్తినేని శ్రీనివాస్, కోశాధికారిగా జైపాల్‌రెడ్డి, కార్య నిర్వాహక అధ్యక్షురాలుగా రచన, మహిళా విభాగం కార్యదర్శిగా సమీన బేగం ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ఈ కార్యక్రమంలో సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు దేవేందర్, కౌన్సిల్ సభ్యులు శ్రీనివాస్, కంకనాల శ్రీనివాస్ పాల్గొన్నారు.

దరఖాస్తుల ఆహ్వానం

జగిత్యాల: తెలంగాణ ఓపెన్ స్కూల్ సొసైటీ దూర విద్యా విధానంలో 2023-24 విద్యా సంవత్సరానికి ప్రవేశాల కోసం నోటిఫికేషన్ విడుదలైందని అధ్యయన కేంద్రం కో ఆర్డినేటర్ శ్యామ్ సోమవారం తెలిపారు. ఈనెల 10 నుంచి ఆగస్టు 10వ తేదీ వరకు ఓపెన్ స్కూల్స్, ఎస్సెస్సీ, ఇంటర్‌లో ప్రవేశాలు కల్పిస్తామన్నారు. ఆగస్టు 31వ తేదీ వరకు ఆలస్య రుసుంతో దరఖాస్తు చేసుకునేందుకు గడువు ఉందని పేర్కొన్నారు. సెప్టెంబర్‌లో క్లాసులు నిర్వహించనున్నట్లు వెల్లడించారు. 14ఏళ్ల వయసు నిండిన, బడి మానేసిన వారు పదో తరగతి పరీక్ష రాసేందుకు అర్హులని, ఇంటర్మీడియెట్ ఫెయిల్ అయిన వారికి అవకాశం ఉంటుందన్నారు.

చినుకు రాలదు చింత తీరదు



వెల్దుర్తి శివారులోని మక్క మొక్కలకు డ్రిప్ ద్వారా నీళ్లు అందిస్తున్న రైతు

జగిత్యాలఅగ్రికల్చర్: వానాకాలం సీజన్ ప్రారంభమైంది. జూన్ గడిచింది. జూలై మొదలైంది. ఇప్పటికీ ఆశించిన స్థాయిలో వర్షాలు కురవడంలేదు. కేవలం చిరుజల్లులే.. అవికూడా కొన్ని ప్రాంతాల్లోనే కురుస్తున్నాయి. విత్తనాలు, ఎరువులు, పురుగు మందులు కొనుగోలు చేసి సాగుకు సన్నద్ధమైన అన్నదాత.. వరుణ దేవుడి కరుణ కోసం నిరీక్షించాల్సి వస్తోంది.

జిల్లాలో ఇప్పటిదాకా నమోదైన లోటు వర్షపాతం(మి.మీ.లలో)	
ప్రాంతం	లోటు వర్షపాతం
జగిత్యాల	81
జగిత్యాలరూరల్	79
రాయికల్	55
బుగ్గారం	52
ధర్మపురి	66
బీర్‌పూర్	60
సారంగాపూర్	64
మల్యాల	86
గొల్లపల్లి	73
పెగడపల్లి	78
కొడిమ్యాల	80
వెల్గటూర్	80
కోరుట్ల	76
మేడిపల్లి	81
మెట్‌పల్లి	73
ఇబ్రహీంపట్నం	53
కథలాపూర్	81
మల్లాపూర్	01

- జిల్లాలో తీవ్ర వర్షాభావం
- 71శాతం లోటు వర్షపాతం
- నెల గడిచినా జాడలేని వానలు
- ఈ నెలపైనే అన్నదాతల ఆశలు

జిల్లాలో పొడి వాతావరణం..

- జిల్లాలో కొద్దిరోజులుగా పొడి వాతావరణం నెలకొని ఉంటోంది.
- 36–38 డిగ్రీల సెల్సియస్ వరకు ఉష్ణోగ్రతలు నమోదవుతున్నాయి.
- వ్యవసాయ బావుల్లోని నీటితో పంటలు పండించుకోవచ్చనే ఆశతో కొందరు రైతులు పసుపు, పెసర, మొక్కజొన్న, కంది, పత్తి విత్తనాలు విత్తుకున్నారు.
- వర్షం కురిస్తే విత్తనాలు చల్లుకోవచ్చనే ఆశతో మరికొందరు నిరీక్షిస్తున్నారు.

71 శాతం లోటు వర్షపాతం..

జూన్‌లో సాధారణ వర్షపాతం 173.3 మి.మీ. కాగా, ఇప్పటివరకు 49.87 మి.మీ. వర్షపాతం నమోదైంది. సాధారణ వర్షపాతంతో పోల్చితే 123.43 మి.మీ.(71శాతం లోటు) తక్కువగా నమోదైంది. రెండు, మూడు రోజులకోసారి చిరుజల్లులు కురుస్తున్నా.. నేల తడవడంలేదు. నైరుతి రుతుపవనాల ఆధారంగా జూన్ 15 నుంచి సెప్టెంబర్ వరకు జిల్లాలో వర్షాలు కురుస్తాయి. ఇప్పటికీ వానలు కురవకపోవడంతో రైతులు వాటికోసం ఎదురుచూస్తున్నారు.

డ్రిప్ ఆధారంగా నీళ్లు..

- జిల్లాలో అత్యధిక ఉష్ణోగ్రతలు నమోదు కావడంతో ఎండల తీవ్రత పెరుగుతోంది.
- దీంతో ఇప్పటికే పసుపు, మొక్కజొన్న తదితర ఆరుతడి విత్తనాలు నేలలో వేసిన రైతులు.. వ్యవసాయ బావుల్లోని నీటిని డ్రిప్ ద్వారా అందిస్తున్నారు.
- సాధారణంగా జూన్‌లో వర్షాలు తక్కువగా కురిస్తే.. జూలైలో అధికంగా వర్షాలు కురిసే అవకాశాలు ఉంటాయని పొలాసలోని వాతావరణ శాస్త్రవేత్తలు చెబుతున్నారు.
- కానీ, జూలై 3వ తేదీ వరకూ ఆశించిన స్థాయిలో వర్షాలు కురవలేదు.
- ఇదే పరిస్థితి కొనసాగితే పంటలు ఎలా పండించేదని రైతులు ఆందోళన చెందుతున్నారు.
- కొందరు రైతులు వ్యవసాయబావుల ఆధారంగా వరి నారు పోశారు.
- వాగులు, కుంటలు, చెరువుల్లో ఇప్పటికీ కొత్తనీరు చేరలేదు.

విత్తనాలు వేసేదెలా?



అప్పుడప్పుడు వర్షాలు కురిసినా చిరుజల్లులకే పరిమితమవుతున్నాయి. విత్తనాలు వేసే పరిస్థితి లేదు. అదను దాటిపోతుందని, బావిలో నీరు ఉండటంతో రెండెకరాల్లో పసుపు, మక్క విత్తనాలు వేసిన. వాటిని కాపాడుకునేందుకు డ్రిప్ ద్వారా నీళ్లు అందిస్తున్న.

– ఏలేటి స్వామిరెడ్డి, రైతు, శ్రీరాములపల్లి, గొల్లపల్లి

జూలైలో కురిసే అవకాశం

జూన్ నెలలో పెద్దగా వర్షాలు కురవలేదు. లోటు వర్షపాతమే నమోదైంది. ఈ జూలైలో ఆశించినస్థాయిలో వానలు కురిసే అవకాశం ఉంది. తేలికపాటి నేలల్లో విత్తనాలు వేసిన రైతులు నీళ్లు అందించాలి. వాతావరణ మార్పులతో వర్షాలు కురవడంలో కొంత ఆలస్యం అవుతోంది.

– డాక్టర్ నవత, వాతావరణ శాస్త్రవేత్త, పొలాస

3వేల మందికి 'గృహలక్ష్మి'

- విత్తనాల కొరత లేకుండా చూసుకోవాలి
- రైస్‌మిల్లర్లు సామర్థ్యం మేర పనిచేయాలి
- ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాంతికుమారి



మాట్లాడుతున్న కలెక్టర్ యాస్మిన్‌బాషా, మకరంద్

జగిత్యాల: ప్రతీ అసెంబ్లీ నియోజకవర్గంలో 3 వేల మందిని గృహలక్ష్మి పథకం కోసం ఎంపిక చేయాలని ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాంతికుమారి సూచించారు. ప్రభుత్వ కార్యక్రమాల అమలుపై జిల్లా కలెక్టర్లతో సోమవారం సీఎస్ కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఎరువులు, విత్తనాల కొరత రాకుండా పర్యవేక్షణ చేయాలన్నారు. పట్టాదారుల వివరాలు సేకరించి ధరణిలో అప్‌డేట్ చేయాలని ఆదేశించారు. ప్రతి నెలా లక్ష్యాలు నిర్దేశించుకుని ఆయిల్‌పామ్ సాగు చేయాలని చెప్పారు. జిల్లాలో 20 శాతం మేర రైస్‌మిల్లులను తనిఖీ చేయాలని, ప్రతీరైస్‌మిల్లుకు కేటాయించిన ధాన్యం మరపడుతున్నారా, లేదా అని పరిశీలించాలన్నారు. రూ.లక్ష సాయం కోసం వచ్చిన దరఖాస్తులను క్షేత్రస్థాయిలో పరిశీలించి అర్హులను ఎంపిక చేయాలని చెప్పారు. రెండోదశ గొర్రెల పంపిణీ పారదర్శకంగా చేయాలని అన్నారు. కొత్త గ్రామపంచాయతీ భవనాలను త్వరితగతిన పూర్తిచేయాలన్నారు. కలెక్టర్ యాస్మిన్ బాషా మాట్లాడుతూ, జిల్లాలో అన్ని చర్యలు తీసుకుంటున్నామన్నారు. ఆయిల్‌పామ్ సాగుపై రైతులకు అవగాహన కల్పిస్తున్నామని చెప్పారు. 132 కొత్త గ్రామపంచాయతీ భవనాలను పూర్తిచేస్తున్నామని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్ మకరంద్, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

మరో 77 పరీక్షలు ఉచితం

- అందుబాటులోకి వచ్చిన 134 వ్యాధి నిర్ధారణ టెస్ట్‌లు
- తెలంగాణ డయాగ్నొస్టిక్ సెంటర్‌కు చేరిన వైద్య పరికరాలు



జగిత్యాల: జిల్లా కేంద్రంలోని తెలంగాణ డయాగ్నొస్టిక్ సెంటర్‌లో మరో 77 ఖరీదైన వ్యాధి నిర్ధారణ పరీక్షలు అందుబాటులోకి వచ్చాయి. వీటన్నింటినీ పేదలకు ఉచితంగానే అందిస్తారు. మొన్నటిదాకా 57 రకాల వ్యాధి నిర్ధారణ పరీక్షలు చేసేవారు. మంత్రి హరీశ్‌రావు ఆదివారం వర్చువల్ విధానంలో వీటిని అందుబాటులోకి తీసుకొచ్చిన విషయం విదితమే.

టీ హబ్‌కు చేరిన పరికరాలు..

- ప్రభుత్వం తాజాగా అందుబాటులోకి తీసుకొచ్చిన 77 రకాల వ్యాధి నిర్ధారణ పరీక్షలకు అవసరమైన వైద్య పరికరాలు ఇప్పటికే టీ హబ్‌కు చేరుకున్నాయి.
- వీటికోసం సుమారు రూ.2కోట్లు వెచ్చించినట్లు అధికారులు తెలిపారు.
- పాథలాజీ, మైక్రో బయోలజీ, బయో కెమిస్ట్రీ, రేడియాలజీ విభాగాల్లో వైద్య పరీక్షలు చేస్తారు.

పేదలకు ఉచితం..

ప్రస్తుతం ప్రైవేట్ ఆస్పత్రుల్లో చిన్న వ్యాధి నిర్ధారణ పరీక్షకు కూడా రూ.300 నుంచి రూ.400 బిల్లు వేస్తున్నారు. తెలంగాణ డయాగ్నొస్టిక్ సెంటర్‌లో చిన్న వ్యాధులే కాదు.. ఖరీదైన పరీక్షలనూ ఉచితంగానే చేస్తున్నారు. గర్భిణుల శస్త్ర చికిత్సలకు అవసరమైన పరీక్షలన్నీ టీ హబ్‌లో ఉచితంగా అందుబాటులోకి వచ్చాయి. బ్లడ్, యూరిన్ తదితర టెస్ట్‌లకు ప్రైవేట్ ఆస్పత్రుల్లో రూ.వెయ్యి నుంచి రూ.2 వేల వరకు బిల్లు వసూలు చేసేవారు. టీ హబ్ ద్వారా ఇవన్నీ ఉచితంగానే అందుతున్నాయి. అయితే, పేషెంట్లు తొలుత పీహెచ్‌సీలు, యూపీహెచ్‌సీలకు వెళ్లి అవసరమైన నమూనాలను వైద్యసిబ్బందికి ఇస్తున్నారు. వారు నేరుగా జిల్లా కేంద్రంలోని డయాగ్నొస్టిక్ సెంటర్‌కు పంపిస్తున్నారు. సాయంత్రం వరకు రిపోర్ట్‌లు తిరిగి వస్తున్నాయి. వీటిపై పేషెంట్ల మొబైల్ నంబర్లకు మెసేజ్‌లు వెళ్తున్నాయి.

వైద్య కళాశాలలో అధ్యాపకుల కొరత

- ఇబ్బందుల్లో వైద్య విద్యార్థులు



జగిత్యాల: జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ వైద్య కళాశాలలో అధ్యాపకుల కొరత వైద్య విద్యార్థులను వేధిస్తోంది. ఇటీవల 35 మంది అధ్యాపకులు విధుల్లో చేరినా.. అనాటమీ, ఫిజియోలజీ విభాగాల్లో కొరత అలాగే ఉంది. గతేడాది 150 మంది వైద్య విద్యార్థులతో కాలేజీ ప్రారంభమైంది. ఈ ఏడాది ఎన్‌ఎంసీ నుంచి అనుమతి వచ్చింది. దీంతో మరో 150 మంది విద్యార్థులు ప్రవేశాలు తీసుకుంటారు. ప్రస్తుతం అనాటమీ విభాగంలో ఒక సీనియర్ ప్రొఫెసర్ మాత్రమే ఉన్నారు. కాంట్రాక్టు పద్ధతిన పనిచేస్తున్న మహారాష్ట్రకు చెందిన ఒక అసిస్టెంట్ ప్రొఫెసర్ సోమవారం తన విధులకు రాజీనామా చేశారు. సీనియర్ ప్రొఫెసర్ ఒక్కరే మిగిలారు. థియరీ క్లాసులు బోధించడం ఇబ్బందిగా మారింది. ఫిజియోలజీలో అసిస్టెంట్ ప్రొఫెసర్ ఒకరే ఉండగా ప్రస్తుతం సీనియర్ రెసిడెన్సీ, అసోసియేట్ ప్రొఫెసర్లతో నెట్టుకు వస్తున్నారు. నిజానికి అనాటమీ, ఫిజియాలజీలో ఒక ప్రొఫెసర్, ఒక అసోసియేట్ ప్రొఫెసర్, ఇద్దరు అసిస్టెంట్ ప్రొఫెసర్లు, ఇద్దరు సీనియర్ రెసిడెన్సీలు ఉండాలి.

నెలరోజుల్లో సెమిస్టర్ పరీక్షలు..

మరో నెల రోజుల్లో సెమిస్టర్ పరీక్షలు జరుగుతాయి. ఈ నేపథ్యంలో అతిముఖ్యమైన అనాటమీ, ఫిజియోలజీ విభాగాల్లో ప్రొఫెసర్ల కొరత వైద్య విద్యార్థులను వేధిస్తోంది. దీనికితోడు ఇంకో నెల రోజుల్లో మరో వైద్యవిద్యార్థుల బ్యాచ్ కళాశాలకు రానుంది. అప్పుడు అధ్యాపకుల సంఖ్య మరింత అవసరమవుతుంది. ఇప్పటికే ప్రిన్సిపాల్ శివరాం ప్రసాద్.. అధ్యాపక పోస్టులు భర్తీ చేయాలంటూ డైరెక్టర్ ఆఫ్ మెడికల్ అడ్మినిస్ట్రేషన్‌కు ప్రతిపాదనలు పంపించినట్లు తెలిసింది.

పేదల సంక్షేమంపై కేంద్రప్రభుత్వం దృష్టి



కరపత్రాలు పంపిణీ చేస్తున్న భోగ శ్రావణి

జగిత్యాలరూరల్/సారంగాపూర్: పేదల సంక్షేమం కోసం కేంద్రప్రభుత్వం అనేక పథకాలు అమలు చేస్తోందని బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యురాలు భోగ శ్రావణి, నాయకుడు పన్నాల తిరుపతిరెడ్డి అన్నారు. జగిత్యాల రూరల్ మండలం పొలాస, సారంగాపూర్ మండలం తుంగూర్ గ్రామాల్లో మహాజన్ సంపర్క్ అభియాన్ కార్యక్రమంలో భాగంగా గడపగడపకూ బీజేపీ నిర్వహించారు. వారు మాట్లాడుతూ, ప్రధానమంత్రి నరేంద్రమోదీ తొమ్మిదేళ్ల పాలనలో కులమతాలకతీతంగా దేశాన్ని అన్ని రంగాల్లో అభివృద్ధి చెందుతోందన్నారు. ఈ కార్యక్రమాల్లో పలువురు నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

సమస్యలు పరిష్కరించండి



కలెక్టర్ యాస్మిన్ బాషాకు అర్జీ అందజేస్తున్న కౌన్సిలర్ నక్క జీవన్

- ప్రజావాణికి బాధితుల మొర
- అర్జీలు స్వీకరించిన కలెక్టర్ యాస్మిన్ బాషా

జగిత్యాలటౌన్: 'సారూ చాలాదూరం నుంచి వచ్చినం.. మా సమస్యలను ఆలకించండి.. సత్వరమే పరిష్కరించండి' అని పలువురు అభాగ్యులు కలెక్టర్ యాస్మిన్ బాషాకు విన్నవించారు. అర్జీలు స్వీకరించిన కలెక్టర్.. ప్రజావాణి ద్వారా అందిన సమస్యలకు అత్యధిక ప్రాధాన్యం ఇచ్చి సత్వరమే పరిష్కరించాలని ఆదేశించారు. కలెక్టరేట్‌లో సోమవారం నిర్వహించిన ప్రజావాణికి వివిధ సమస్యలపై 22 దరఖాస్తులు అందాయి. వాటిని స్వీకరించిన కలెక్టర్.. భూ సంబంధిత, ఉపాధి, పింఛన్లు తదితర సమస్యలపై వచ్చిన దరఖాస్తులను పరిశీలించి నిబంధనల మేరకు పరిష్కరించాలని చెప్పారు.

చర్యలు తీసుకోండి

తాను ప్రాతినిధ్యం వహిస్తున్న 12వ వార్డులో చేపట్టిన సంఘ భవన నిర్మాణం కోసం చేపట్టిన భూమిపూజలో అధికారులు ప్రొటోకాల్ విస్మరించి తనను ఆహ్వానించలేదని 12వ వార్డు కౌన్సిలర్ నక్క జీవన్ ఆవేదన చెందారు. ఈమేరకు ప్రజావాణి ద్వారా కలెక్టర్‌కు ఫిర్యాదు చేశారు. దళిత కౌన్సిలర్ అయినందునే తనను ఇలా అవమానించారని ఆరోపించారు. బాధ్యులైన అధికారులపై చర్యలు తీసుకోవాలని ఆయన కోరారు.

పేదలకు ఇళ్లపట్టాలు మంజూరు చేయండి




ధర్నా చేస్తున్న నాయకులు

జగిత్యాలటౌన్: జిల్లాలోని అర్హులైన పేదలకు 125 గజాల విస్తీర్ణంగల ఇళ్ల స్థలాలు మంజూరు చేయాలని ప్రజాసంఘాల పోరాట వేదిక నాయకులు డిమాండ్ చేశారు. పేదలకు ఇళ్లపట్టాలు ఇవ్వాలని కోరుతూ కలెక్టరేట్ ఎదుట సోమవారం సీపీఐ, సీపీఎం ఆధ్వర్యంలో ధర్నా చేశారు. నాయకులు మాట్లాడుతూ సంపన్న వర్గాలకు రూ.కోట్ల విలువైన భూములు అప్పనంగా అప్పగిస్తున్న రాష్ట్ర ప్రభుత్వం.. నిలువ నీడలేని పేదలకు సొంతింటి కల నెరవేర్చాలన్నారు. కోరుట్ల సంగెం రోడ్డు సర్వేనంబర్ 923లోని 52 ఎకరాల్లో 1,500మంది పేదలు గుడిసెలు వేసుకుని జీవనం సాగిస్తున్నారని అన్నారు. వారందరికీ ఇళ్ల పట్టాలు మంజూరు చేయాలని, కరెంట్, తాగునీటి సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో నాయకులు ఇందూరి సులోచన, తిరుపతినాయక్ తదితరులు ఉన్నారు.

డుమ్మా మాస్టార్లు!

- ఉమ్మడి జిల్లాలో సరిగా అమలుకాని బయోమెట్రిక్
- సమయపాలనకు మంగళం
- బడికి రాకపోయినా ఆన్‌డ్యూటీలుగా నమోదు
- సీఆర్‌పీలు, ఇన్‌చార్జి ఎంఈవోలు సైతం ఇదే బాటలో



జిల్లా	పాఠశాలలు	ఉపాధ్యాయులు	విద్యార్థులు
కరీంనగర్	623	2,787	36,775
జగిత్యాల	748	3,915	65,632
పెద్దపల్లి	580	2,423	45,626
సిరిసిల్ల	510	2,651	37,803



సాక్షిప్రతినిధి, కరీంనగర్: ఉమ్మడి కరీంనగర్ జిల్లాలో ఉపాధ్యాయుల హాజరు కోసం ఏర్పాటు చేసిన బయోమెట్రిక్ విధానం పూర్తిస్థాయిలో అమలు కావడంలేదు. ఇటీవల కరీంనగర్ డీఈవో చొప్పదండికి తనిఖీకి వెళ్లినపుడు ముగ్గురు టీచర్లు ఆలస్యంగా రావడంతో వారిని సీఎల్ పెట్టుకోమని ఆదేశించారు. మరోవైపు.. జగిత్యాల, పెద్దపల్లి, రాజన్న సిరిసిల్ల జిల్లాల్లోనూ ఇదే తరహా పరిస్థితి ఉంది. ఈ వ్యవహారంపై కొందరు సమాచార హక్కు చట్టం ద్వారా జగిత్యాల విద్యాశాఖ నుంచి వివరాలు కోరినప్పుడు గురువుల డుమ్మాల బాగోతం బయటపడింది. బడికిరాకున్నా.. వచ్చినట్లు అటెండెన్స్ వేసుకునే మాస్టార్ల నిర్వాకం వెలుగుచూసింది. ఎవరి అనుమతి తీసుకోకుండా మాష్టార్లు రోజుల తరబడి బడికి రాకపోవడం.. సమయపాలన పాటించకపోవడం తదితరాలన్నీ స్పష్టంగా తెలిశాయి.

ఏం జరుగుతోంది?

ప్రభుత్వ ప్రైమరీ స్కూళ్లలో ఉదయం 9 నుంచి సాయంత్రం 4 గంటలు, హైస్కూళ్లలో ఉదయం 9.30 నుంచి సాయంత్రం 4.45 గంటల వరకు ఉపాధ్యాయులు ఉండాలి. కొందరు గురువులు ఈ సమయపాలన పాటించడం లేదు. చాలామంది గంట లేదా రెండుగంటలు ఆలస్యంగా రావడం, లేదా గంట..గంటన్నర ముందుగానే వెళ్లిపోవడం చేస్తున్నారు. ప్రభుత్వ పాఠశాలల్లో ప్రభుత్వ విద్యా సంబంధిత కార్యక్రమాల అమలుకోసం క్లస్టర్ రిసోర్స్ పర్సన్ (సీఆర్‌పీ)లను నియమిస్తారు. ఈపనుల మీద వివిధ స్కూళ్లకు వెళ్లాల్సి వస్తోంది. కానీ.. పనులు లేనప్పుడు కూడా సీఆర్‌పీలు హాజరు కావడం లేదు. వీరు ఇతర ప్రాంతాల్లో విధులు నిర్వహించే సమయంలో ఆన్‌డ్యూటీ(ఓడీ)లుగా నమోదు చేస్తున్నారు. సీఆర్‌పీలతోపాటు కొందరు ఉపాధ్యాయులు కూడా పలుచోట్ల ఓడీలుగా నమోదు చేసుకుంటున్నారు. ఎలాంటి అదనపు విధులు లేనిఉపాధ్యాయులు కూడా ఓడీలు ఎందుకు పెట్టుకుంటున్నారో వారికే తెలియాలని తోటిటీచర్లు వాపోతున్నారు. ఆలస్యంగా వచ్చినా.. ముందుగా వెళ్లినా వీరెవరికీ వేతనాల్లో ఎలాంటి కోతలు విధించడం లేదు. గతేడాది మధ్యలో ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా తరచూ ఆలస్యంగా వచ్చే పలువురు ఉపాధ్యాయులకు మెమోలతో సరిపెట్టారు. ఆ తర్వాత వీరెవరిపైనా ఎలాంటి పర్యవేక్షణ లేదు. దీంతో చాలామంది టీచర్లు ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తున్నారు.

నిర్వహణ అంతంతే..

రాష్ట్రవ్యాప్తంగా 33 జిల్లాల్లో కేవలం 14 జిల్లాల్లో మాత్రమే బయోమెట్రిక్ అమలవుతోంది. ఉమ్మడి జిల్లాలో బయోమెట్రిక్ నిర్వహణ ఓ ఏజెన్సీకి అప్పగించారు. పొరపాటున ఏదైనా స్కూల్లో బయోమెట్రిక్ యంత్రం మొరాయించినా.. సాంకేతిక సమస్య తలెత్తినా దాన్ని వెంటనే రిపేరు చేయడం లేదు. సదరు ఏజెన్సీ నిర్వాహకులు ఫిర్యాదు చేసినా వారం లేదా రెండు వారాల తర్వాత వచ్చి బాగు చేస్తున్నారు. ఇదే అదనుగా పలువురు ఉపాధ్యాయులు ఏకంగా పాఠశాలలకు డుమ్మాలు కొట్టేస్తున్నారు. సాధారణ ఉపాధ్యాయులతో పాటు ఇన్‌చార్జి ఎంఈవోలు కూడా ఇదే బాటలో పయనిస్తున్నారు. కొందరు ఇన్‌చార్జి ఎంఈవోలు ఏకంగా 15 రోజులపాటు ఆన్‌డ్యూటీలు పెట్టుకున్నారంటే పరిస్థితి అర్థం చేసుకోవచ్చు. నిరంతరం స్కూలుకు ఆలస్యంగా వస్తూ.. డుమ్మాలు కొడుతూ ఆన్‌డ్యూటీలు వేసుకుంటున్న టీచర్లపై విద్యార్థుల తల్లిదండ్రులు, తోటి ఉపాధ్యాయులు మండిపడుతున్నారు. బడికి రాకున్నా.. దొడ్డిదారిలో హాజరు వేసుకుని, జీతం తీసుకోవడం ఎక్కడి నైతికత అని విమర్శిస్తున్నారు.

క్లుప్తంగా

సోషల్ మీడియాలో ప్రచారం అవాస్తవం



గ్రూప్–4 పరీక్షకు హాజరైన అభ్యర్థులు(ఫైల్)

జగిత్యాల/కొండగట్టు(చొప్పదండి): కొడిమ్యాల మండలం నాచుపెల్లి జేఎన్టీయూలో ఈనెల ఒకటిన జరిగిన గ్రూప్– 4 పరీక్షలో అధికారులు నిబంధనలు అతిక్రమించి అభ్యర్థులను తనిఖీ చేశారనే ప్రచారం అవాస్తవమని ప్రిన్సిపాల్ రమేశ్ సోమవారం జారీచేసిన ఒక ప్రకటనలో తెలిపారు. చెవిరింగులు ఉన్న మహిళా అభ్యర్థిని పరీక్షహాల్‌లోకి అనుమతించ లేదనే వార్త పూర్తిగా ఫేక్ అని పేర్కొన్నారు. మహిళా అభ్యర్థులకు ఇబ్బందులు కలుగకుండా, పరీక్ష ప్రశాంతంగా జరిగిందన్నారు. ఇదే విషయంలో తమను జగిత్యాల డీఎస్పీ కార్యాలయంలో పోలీసులు విచారణ జరిపారని తెలిపారు. సామాజిక మాధ్యమాల్లో వైరల్ అవుతున్న వీడియో తమకు సంబంధించినది కాదని ప్రిన్సిపాల్ వివరించారు. పరీక్ష కేంద్రం వద్ద ఆరోజు సూపరింటెండెంట్, ప్రిన్సిపాల్ డి.రమేశ్, చీఫ్ సూపరింటెండెంట్ ఎం.తిరుపత్తమ్మ, లైజన్ ఆఫీసర్, మెప్మా పీడీ డి.శ్రీనివాస్, గిర్దావర్ రవీందర్, తహసీల్దార్‌లు ఉన్నట్లు ఆయన వివరించారు.

4న దొడ్డి కొమురయ్య వర్ధంతి

జగిత్యాల: జిల్లా సమీకృత కలెక్టర్ కార్యాలయంలో ఈనెల 4న తెలంగాణ అమరుడు దొడ్డి కొమురయ్య వర్ధంతి నిర్వహించనున్నట్లు జిల్లా వెనుకబడిన తరగతుల అభివృద్ధి అధికారి రాజ్‌కుమార్ సోమవారం తెలిపారు. ప్రజాప్రతినిధులు, బీసీ, ఎస్సీ, ఎస్టీ అధికారులు హాజరు కావాలని ఆయన కోరారు.

10న మత్స్య సహకార సంఘం సమావేశం

జగిత్యాలఅగ్రికల్చర్: జిల్లా కేంద్రంలోని దేవిశ్రీ గార్డెన్స్‌లో ఈనెల 10న జిల్లా మత్స్య సహకార సంఘం సమావేశం నిర్వహించనున్నట్లు ఆ శాఖ అధికారి దామోదర్ సోమవారం తెలిపారు. మత్స్య సహకార సంఘం చీఫ్ ప్రమోటర్‌తోపాటు 10 మంది తాత్కాలిక కార్యవర్గ సభ్యులను ఈసందర్భంగా ఎన్నుకుంటామని పేర్కొన్నారు. జిల్లాలోని అన్ని ప్రాథమిక సహకార సంఘాల అధ్యక్షులు హాజరు కావాలని ఆయన కోరారు.

ఎడ్ల నాగలికి గిరాకీ

- పసుపు విత్తనం వేసేందుకు రోజుకు రూ.3, 500
- ప్రతి గ్రామంలో రైతులకు ఐదారు జతల కాడెడ్లు
- ఆధునిక యంత్ర పరికరాలు వచ్చినా ఎడ్ల నాగలికి డిమాండ్

జగిత్యాల అగ్రికల్చర్ : వ్యవసాయంలో ట్రాక్టర్లు, అధునాతన యంత్ర పరికరాలు వచ్చినా సాగుభూమిలో విత్తనాలు వేసేందుకు నాగళ్లతోపాటు కాడెడ్లు, కనుమరుగవుతున్నాయి. దీంతో విత్తనాలు వేయడానికి కాడెడ్లతో దున్నేందుకు మనిషిని కిరాయి మాట్లాడుకునే పరిస్థితి నెలకొంది. ఒకరోజుకు పసుపు విత్తనం వేసేందుకు గాను ఒక వ్యక్తి కాడెడ్లతో దున్నితే రూ 3,500 చెల్లిస్తున్నారు.

పోషణ నుంచి తప్పుకుంటున్న అన్నదాత

ఒకప్పుడు గ్రామాల్లో ప్రతీరైతుకు కనీసం నాలుగైదు ఎద్దులుండేవి. కనీసం ఒక జత కాడెడ్లు లేనివారిని రైతులు అనేవారు కాదు. ప్రస్తుతం కాడెడ్లను పోషించే స్థోమత ఉన్నా నీరుపెట్టడం, మేత వేయడం వంటి పనులు చేయలేక, కాడెడ్లు ఉన్న రైతులు సైతం అమ్ముతున్నారు. దీనికి తోడు, దుక్కి దున్నడం నుంచి పంట కోసేవరకు ప్రతి పనిని ట్రాక్టర్లతో చేయడం, ఒక్కో గ్రామంలో 10–15 ట్రాక్టర్లు రావడం, వాటికి ఆధునిక పరికరాలు తయారు చేసి వినియోగించడంతో రైతులు ట్రాక్టర్ల వైపు దృష్టిసారిస్తున్నారు. నాలుగైదు ఎకరాలున్న రైతులు ట్రాక్టర్లను కొనుగోలు చేస్తున్నారు. ఫైనాన్స్ కంపెనీలతో ఒప్పందాలు చేసుకొని రైతులకు ఆరు నెలలకోసారి వాయిదా పద్ధతిలో రుణాలు ఇస్తుండటంతో రైతులు ట్రాక్టర్లను కొనుగోలు చేస్తున్నారు.



ఎడ్ల నాగలితో పసుపు విత్తనం వేస్తున్న రైతులు

ఎద్దులు ఉన్నవారికి డిమాండ్..

ప్రస్తుతం ఏ గ్రామంలో చూసినా పది జతలకు మించి కాడెడ్లు కనిపించడం లేదు. దీంతో విత్తనం వేసేందుకు మిగతా రైతులు కాడెడ్లు ఉన్నవారి వైపు చూసే పరిస్థితి. ప్రస్తుతం వర్షాలు కురుస్తుండటం, భూమిలో తేమ ఎక్కువైనా, తక్కువైనా విత్తనాలు వేయడం ఇబ్బందిగా మారడంతో కాడెడ్ల కోసం రైతులు వెతికే పరిస్థితి నెలకొంది. ట్రాక్టర్‌తో పోల్చితే కాడెడ్ల నాగలితో విత్తనం వేస్తే, భూమిలో అనుకున్నంత లోతులో విత్తనం పడి, మొలకెత్తే అవకాశం ఉంటుంది. జిల్లా రైతులు ఎక్కువగా పసుపు విత్తనం వేసేందుకు కాడెడ్లపైనే ఆధారపడుతుండటంతో, ఎడ్ల నాగలికి గిరాకీ పెరిగింది. దీంతో, కాడెడ్లు ఉన్నవారికి ముందే అడ్వాన్సులు ఇస్తున్నారు. ఉదయం 10 సాయంత్రం 5 గంటల వరకు ఎడ్ల నాగలితో దున్నితే రూ 3,500 ఇస్తున్నారు. మధ్యాహ్నం భోజనం, సాయంత్రం కల్లు అదనం. కొందరు రైతులు చేరో ఎద్దును కొనుగోలు చేసి విత్తనాలు వేసుకొని తర్వాత అమ్మేలా చూసుకుంటున్నారు. మరికొందరు విత్తనాలు వేసేవరకు కేవలం కాడెడ్లను రూ.15–20 వేలకు కిరాయికి తీసుకువస్తున్నారు. కాడెడ్ల జత రేటు రూ. 80నుంచి 90 వేల వరకు ఉండటంతో కొనుగోలుకు వెనుకంజ వేస్తున్నారు.

పసుపు వేసేందుకు కిరాయి తీసుకున్నా



పెద్దగా పనిలేక ఎడ్లను అమ్మినా. ఇప్పుడు పసుపు విత్తనం వేసేందుకు రూ 3,500 కిరాయి తీసుకున్నా. వారం రోజుల ముందే ఎడ్లనాగలి ఉన్నవారికి అడ్వాన్సులు ఇవ్వాల్సిన పరిస్థితి. చాలా గ్రామాల్లో రైతుల పరిస్థితి ఇలాగే ఉంది.

– క్యాతం సాయిరెడ్డి, సింగరావుపేట, రాయికల్

విత్తనం సీజన్‌లో పని దొరుకుతుంది



కాడెడ్లకు విత్తనం సీజన్‌లోనే పని దొరుకుతుంది. ఇటీవల కొందరు రైతులు ట్రాక్టర్‌తో కూడా పసుపు వేస్తున్నారు. ఏడాది పొడవునా ఎద్దులను మేపాల్సి వస్తుంది. విత్తనం వేసే రోజు ఎడ్లతో రోజంతా నడవాల్సి ఉంటుంది. పెరిగిన నిత్యావసర వస్తువులతో మాకు ఏమి మిగలడం లేదు.

– నర్సయ్య, కాడెడ్ల యజమాని

ఒక్కో జతకు రూ.80 వేలు



విత్తనం కోసం ఎడ్లు కొందామన్నా దొరికే పరిస్థితి లేదు. ఒక్కో జతకు రూ 80 వేల రేటు ఉంది. దీంతో, విత్తనం వేసే వారం రోజులు ఎడ్ల నాగలిని కిరాయి తీసుకుంటున్నా. మిగతా పనులు చేయడానికి ట్రాక్టర్ ఉపయోగిస్తాను.

– రాంకిషన్, వెల్దుర్తి, జగిత్యాల రూరల్

ఘనంగా గురు పౌర్ణమి వేడుకలు



పల్లకీ సేవలో ఎమ్మెల్యే విద్యాసాగర్ రావు

కోరుట్ల : పట్టణంలోని సాయిరామ ఆలయంలో గురుపౌర్ణమి వేడుకలు సోమవారం ఘనంగా జరిగాయి. ఈ సందర్భంగా సాయినాథుడికి ప్రత్యేక పూజలు, అర్చనలు, అభిషేకాలు నిర్వహించారు. ఎమ్మెల్యే కల్వకుంట్ల విద్యాసాగర్‌రావు–సరోజన దంపతులు ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం నిర్వహించిన పల్లకీ సేవలో ఎమ్మెల్యే పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ పట్టణంలోని అన్ని ఆలయాలు ప్రతిరోజూ భక్తుల సందడితో కళకళలాడుతున్నాయని పేర్కొన్నారు. కార్యక్రమంలో కౌన్సిలర్లు మోర్తాడ్ లక్ష్మీనారాయణ, జిందం లక్ష్మీనారాయణ, బీఆర్ఎస్ నాయకులు సామల వేణు, యాటం కృష్ణంరాజు, ఆలయ పూజారులు, భక్తులు పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో ఇద్దరికి గాయాలు

జ్యోతినగర్(రామగుండం): ఎన్టీపీసీ రామగుండం మేడిపల్లి సెంటర్ రాజీవ్ రహదారిపై జరిగిన రోడ్డు ప్రమాదంలో సోమవారం ఇద్దరికి గాయాలయ్యాయి. పెద్దపల్లి నుంచి రామకృష్ణాపూర్‌కు వెళ్తున్న ఆటోను లారీ వెనుక నుంచి ఢీకొంది. ఆటోలో ఉన్న మతీనా బేగం, నజ్రీన్‌కు గాయాలయ్యాయి. అక్బర్ హుస్సేన్ ఫిర్యాదు మేరకు ఎన్టీపీసీ పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

ప్రియుడి ఇంటి ఎదుట బైఠాయింపు

వెల్గటూర్ : ప్రియుడి ఇంటి ఎదుట ప్రియురాలు బైఠాయించిన ఘటన ఎండపల్లి మండలం కొత్తపేట గ్రామంలో సోమవారం చోటుచేసుకుంది. యువతి తెలిపిన వివరాల ప్రకారం... గ్రామానికి చెందిన తిగుళ్ల జ్ఞానేందర్‌రెడ్డి అదే గ్రామానికి చెందిన యువతి ఉపాధి నిమిత్తం హైదరాబాద్‌లో ఉండగా ఇద్దరూ సహజీవనం చేశారు. తనను పెళ్లి చేసుకోవాలని యువతి కోరగా జ్ఞానేందర్ రెడ్డి అంగీకరించలేదు. దీంతో యువతి పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేయడంతో అక్కడి పోలీసులు కౌన్సెలింగ్ ఇచ్చారు. జ్ఞానేందర్ రెడ్డి తల్లి అనారోగ్యంతో బాధపడుతోందని, తనకు కొన్నిరోజులు సమయం కావాలని కోరగా యువతి అంగీకరించింది. అనంతరం మరోసారి పెళ్లి ప్రస్తావన తీసుకురాగా స్పందించకపోవడంతోనే ప్రియుడి ఇంటి ఎదుట బైఠాయించినట్లు యువతి తెలిపింది. తనకు న్యాయం జరగకపోతే ఇక్కడే ఆత్మహత్య చేసుకుంటానని యువతి హెచ్చరించింది.



ప్రియుడి ఇంటి ఎదుట బైఠాయించిన యువతి

చిట్‌ఫండ్స్ ఆఫీస్ ఎదుట ఆందోళన

జగిత్యాల క్రైం : చిట్‌ఫండ్స్‌లో వేసిన చిట్టీ కాలపరిమితి ముగిసినా తిరిగి డబ్బులు చెల్లించడం లేదంటూ బాధితురాలు చిట్‌ఫండ్స్ ఎదుట సోమవారం ఆందోళన చేపట్టింది. జిల్లా కేంద్రంలోని అక్షర చిట్‌ఫండ్స్‌లో పట్టణానికి చెందిన చెట్ల వనజ గత నవంబర్‌లో చిట్టీ వేసింది. ఇప్పటివరకు సుమారు రెండు చిట్టీల డబ్బులు రూ.6 లక్షలు చెల్లించారు. డబ్బులు చెల్లించాలని రెండు నెలలుగా కార్యాలయం చుట్టూ తిరుగుతున్నా చెల్లించడం లేదని, చిట్‌ఫండ్స్ మేనేజర్ తిరుపతి పొంతనలేని సమాధానాలు చెబుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. సోమవారం చిట్‌ఫండ్ కార్యాలయానికి వనజ దంపతులు పెట్రోల్ బాటిల్‌ను తీసుకెళ్లగా మేనేజర్ తిరుపతి బెదిరింపులకు పాల్పడటంతో పాటు అసభ్యకరంగా ప్రవర్తించాడని పేర్కొన్నారు. దీంతో బాధితురాలు పట్టణ పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేసింది.



పెట్రోల్ బాటిల్‌తో బాధిత దంపతులు

కొండపై ప్రముఖుల పూజలు

కొండగట్టు(చొప్పదండి): హైకోర్టు రిటైర్డ్ జడ్జి జస్టిస్ చంద్రయ్య, చొప్పదండి ఎమ్మెల్యే సుంకె రవిశంకర్ సోమవారం కొండగట్టు శ్రీఆంజనేయస్వామిని దర్శించుకున్నారు. గురుపౌర్ణమి సందర్భంగా ప్రత్యేక పూజలు చేశారు.



పూజలు చేస్తున్న జస్టిస్ చంద్రయ్య

5 నుంచి సదరం శిబిరాలు

జగిత్యాల: జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ జనరల్ వైద్యశాల ఆధ్వర్యంలో ఈనెల 5నుంచి సదరం శిబిరాలు నిర్వహించనున్నట్లు సూపరింటెండెంట్ రాములు సోమవారం తెలిపారు. ప్రభుత్వ ఆస్పత్రిలో 5న, 12, 19న ఓహెచ్, 21న హియరింగ్, 27న ఎంఆర్‌ఐ శిబిరాలు నిర్వహిస్తామన్నారు. మాతా శిశు సంక్షేమ కేంద్రంలో ఈనెల 26న విజువల్ పరీక్షలు నిర్వహించనున్నారని పేర్కొన్నారు. దరఖాస్తు చేసుకున్న వారు మీసేవ స్లాట్‌బుకింగ్ రసీదు, ఆధార్‌కార్డు, రిపోర్ట్స్ వెంట తీసుకు రావాలని ఆయన సూచించారు.

గంజాయి విక్రయిస్తున్న యువకుల అరెస్టు

తంగళ్లపల్లి(సిరిసిల్ల): గంజాయి విక్రయిస్తున్న ముగ్గురు యువకులను అరెస్టు చేసి వారి నుంచి కిలోన్నర గంజాయి ప్యాకెట్లను సీజ్ చేసినట్లు సిరిసిల్ల రూరల్ సీఐ బి.ఉపేందర్ తెలిపారు. మండలంలోని మండెపల్లి గ్రామ శివారులోని రామాలయం గుడి ప్రాంతంలో గంజాయి విక్రయిస్తున్నారన్న సమాచారం మేరకు దాడులు నిర్వహించినట్లు పేర్కొన్నారు. ఈ దాడుల్లో 1కిలో 470 గ్రాముల గంజాయి ప్యాకెట్లు పట్టుకొని ముగ్గురు యువకులను అరెస్టు చేసినట్లు తెలిపారు. గంజాయి విక్రయిస్తున్న సిరిసిల్ల పట్టణానికి చెందిన ఎండీ.అహ్మద్ అలియాస్ అహ్మద్ పాషా (21), గడదాస్ శివ అలియాస్ శ్రీకాంత్ (23), తాళ్లపల్లి ప్రణయ్ (25)ను రిమాండ్‌కు తరలించినట్లు పేర్కొన్నారు. నాందేడ్‌లో గుర్తు తెలియని వ్యక్తుల వద్ద గంజాయి కొనుగోలు చేసి జిల్లాలో విక్రయిస్తున్నట్లు చెప్పారు. ఎస్సై పాకాల లక్ష్మారెడ్డి, పోలీస్ సిబ్బంది నరేందర్, కార్తీక్, తిరుపతి, శ్రీనివాస్‌ను సీఐ అభినందించారు.

వృద్ధురాలి మెడలోంచి పుస్తెలతాడు చోరీ

ముస్తాబాద్(సిరిసిల్ల): రైతుబంధు డబ్బుల కోసం వచ్చిన వృద్ధురాలి మెడలోంచి ఓ మహిళ పుస్తెలతాడుతో చోరీ చేసింది. వివరాల్లోకి వెళ్తే.. మండలంలోని పోతుగల్‌కు చెందిన మరిపెళ్ల నర్సవ్వ రైతుబంధు డబ్బుల కోసం సోమవారం ముస్తాబాద్‌లోని బ్యాంకుకు వచ్చింది. దాహం వేస్తుందని దుకాణాల్లో అడుగుతుండగా గమనించిన ఓ గుర్తు తెలియని మహిళ కల్లు తాగిస్తానంటూ కల్లు దుకాణానికి తీసుకెళ్లింది. కల్లు తాగించి నర్సవ్వ మత్తులోకి జారుకోగానే మెడలోని మూడు తులాల పుస్తెలతాడుతో పరారైంది. వృద్ధురాలి లబోదిబోమనడంతో కల్లు దుకాణం నిర్వాహకులు పోలీసులకు సమాచా రం అందించారు. పోలీసులు ఘటనా వివరాలు తెలుసుకొని బస్సుల్లో తనిఖీలు చేపట్టారు.

చెట్లు నరికిన వ్యక్తికి జరిమానా

జగిత్యాల రూరల్: జగిత్యాల రూరల్ మండలం పొరండ్లలో హరితహారం చెట్లను నరికివేయగా సోషల్ మీడియాలో వీడియో వైరల్ కావడంతో జిల్లా పంచాయతీ అధికారి దేవరాజ్ విచారణకు ఆదేశించారు. దీంతో ఎంపీడీవో రాజేశ్వరి సోమవారం విచారణ చేపట్టి చెట్ల నరికివేసిన మధుకు రూ.2 వేల జరిమానా విధించారు.



జరిమానా విధించిన రశీదు

పోగొట్టుకున్న సెల్‌ఫోన్ అప్పగింత



బాధితుడికి సెల్‌ఫోన్ అప్పగిస్తున్న సీఐ, ఎస్సైలు

మల్యాల(చొప్పదండి): మండలంలోని ముత్యంపేట గ్రామంలోని కొండగట్టుకు చెందిన బొద్దుల మోహన్ గతనెల 12న కొండగట్టు నుంచి ఆటోలో వెళ్తుండగా తక్కళ్లపల్లి శివారులో సెల్‌ఫోన్ పోగొట్టుకున్నాడు. కాగా పోలీసులకు ఫిర్యాదు చేయడంతో సీఈఐఆర్ ద్వారా సెల్‌ఫోన్‌ను గుర్తించారు. సోమవారం మల్యాల సీఐ కోటేశ్వర్, ఎస్సై అశోక్, కుమారస్వామి బాధితుడికి సెల్‌ఫోన్ అప్పగించారు. ఈ సందర్భంగా మోహన్ పోలీసులకు కృతజ్ఞతలు తెలిపారు.

ఉద్యోగం రాలేదని యువకుడి ఆత్మహత్య



శ్రీకాంత్ మృతదేహం

పెద్దపల్లి రూరల్: బీటెక్ చదివిన తనకు ఉద్యోగం రావడంలేదన్న బెంగతో పెద్దపల్లి జిల్లా కేంద్రంలోని రంగంపల్లికి చెందిన మెంగని శ్రీకాంత్ (26) సోమవారం ఉరివేసుకొని ఆత్మహత్య చేసుకున్నాడు. ఎస్సై మహేందర్ కథనం ప్రకారం.. రంగంపల్లిలోని ఆదర్శనగర్‌లో నివాసముంటున్న శ్రీకాంత్ బీటెక్ పూర్తిచేసి ఉద్యోగం కోసం తిరిగితిరిగి వేసారాడు. ఇక ఉద్యోగం రాదేమోనని మనస్తాపానికి గురై ఆత్మహత్య చేసుకున్నాడు. మృతుడి తండ్రి శ్రీనివాస్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై వివరించారు.

కుక్కలదాడిలో ముగ్గురికి గాయాలు

కథలాపూర్: మేడిపెల్లి మండలం వల్లంపెల్లి, కల్వకోట గ్రామాల్లో కుక్కలు దాడిలో ముగ్గురు గాయపడినట్లు గ్రామస్తులు తెలిపారు. వల్లంపెల్లి గ్రామానికి చెందిన లింగంపెల్లి హర్షవర్ధన్, సాయి, కల్వకోట గ్రామానికి చెందిన గడ్డం శేఖర్ రెడ్డి కుక్కల దాడిలో గాయపడినట్లు తెలిపారు. చికిత్స నిమిత్తం కోరుట్లలోని ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు.

షాదీ డాట్ కామ్‌లో పరిచయమైన కి'లేడీ'

- పెళ్లయిన రెండు నెలలకు డబ్బు, బంగారంతో పరార్
- పోలీసులను ఆశ్రయించిన బాధితుడు



రేవంత్ పెళ్లి ఫొటో

జ్యోతినగర్(రామగుండం): రామగుండం ఎన్టీపీసీ అన్నపూర్ణకాలనీకి చెందిన పాన్‌షాప్ నిర్వాహకుడు వరంగల్ జిల్లాకు చెందిన ఓ యువతి మాయలో పడి మోసపోయాడు. అప్పటికే మూడు పెళ్లిల్లు చేసుకున్న మాయ లేడీ ఇక్కడి యువకున్ని మోసం చేసి డబ్బు, బంగారంతో పరారైంది. దీంతో బాధితుడు ఎన్టీపీసీ పోలీసులకు ఫిర్యాదు చేశాడు. పోలీసుల వివరాలు.. ఎన్టీపీసీ అన్నపూర్ణకాలనీకి చెందిన రేవంత్‌కు అప్పటికే పెళ్లి జరిగి విడాకులయ్యాయి. అయితే ఓ షాదీ డాట్ కామ్ ద్వారా యువతి పరిచయమైంది. ఆ పరిచయం సెల్ ఫోన్లలో ముచ్చట్లు.. తర్వాత పెళ్లి వరకు వచ్చింది. ఇదే మొదటి పెళ్లి అంటూ సదరు యువతి నమ్మించింది. దీంతో రెండు కుటుంబాలకు చెందిన పెద్దలు పెళ్లి కుదిర్చారు. వెంటనే ఎన్టీపీసీలోని చిలుకలయ్య ఆలయంలో సాదాసీదాగా వివాహం చేసుకుని కొత్త కాపురం ప్రారంభించారు. ఇక లేడీ తన కిలాడీల ప్రదర్శన ప్రారంభించింది. తనకు మందు, సిగరేట్లు కావాలంటూ యువకున్ని నిత్యం వేధింపులకు గురిచేసింది. ఇద్దరి మధ్య గొడవలు మొదలై రెండు నెలలు గడిచాయి. ఈక్రమంలో యువతి తన అక్క వద్దకు వెళ్తున్నానని ఇంట్లో ఉన్న రూ.70వేల నగదు, 4 తులాల బంగారు ఆభరణాలతో బిచానా ఎత్తేసింది. రోజులు గడుస్తున్నా తిరిగి రాకపోవడంతో యువకుడు ఆమె బంధువులు, మిత్రుల వద్ద ఆరా తీయడంతో అసలు విషయాలు బయటపడ్డాయి. అప్పటికే మూడు పెళ్లిలు అయ్యాయని, చాలా మందితో పరిచయాలు ఉన్నాయని తెలుసుకున్నాడు. చివరకు చిరునామా తెలుసుకుని వెళ్లడంతో సదరు యువతి తన మిత్రులతో విందు విలాసాలతో కనిపించింది. ఏకంగా వారందరూ పాన్‌షాప్ యువకుడిపై దాడి చేసి, వాటిని వీడియో తీశారు. ఈ వీడియోలు సదరు యువతి మిత్రులు సోషల్ మీడియాలో పెడతామంటూ బెదిరింపులకు గురిచేశారు. అంతేగాకుండా యువకుడి కుటుంబసభ్యులను సైతం డబ్బుల కోసం డిమాండ్ చేశారు. దీంతో యువకుడు ఎన్టీపీసీ పోలీసులను ఆశ్రయించి గోడు వెల్లబోసుకున్నాడు. పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు ప్రారంభించారు.

న్యాయం చేయండి..



పెండ్లి పేరుతో నన్ను ఆమె మోసం చేసింది. మా ఇంటి నుంచి నగదుతో పాటు బంగారం తీసుకెళ్లింది. ఆమెతో పాటు ఆమె స్నేహితుల నుంచి నాకు ప్రాణ భయం ఉంది. నాకు న్యాయం చేయాలి.

– రేవంత్, ఎన్టీపీసీ రామగుండం

యువతి కోసం గాలిస్తున్నాం

పెండ్లి చేసుకుని నగదు, బంగారు ఆభరణాలతో వెళ్లి ఫోన్ స్విచాఫ్ చేసిందని బాధితుడు ఫిర్యాదు చేశాడు. ఆమె కోసం గాలిస్తున్నాం. చీటింగ్ కేసు నమోదు చేశాం. ఇటీవల హైదరాబాద్‌లో ఉందన్న సమాచారంతో వెళ్లినా ఆచూకీ దొరకలేదు. ఆమె పట్టుబడితే పూర్తి విషయాలు తెలిసే అవకాశాలున్నాయి.

– బి.జీవన్, ఎస్సై, ఎన్టీపీసీ

ఎంపీడీవో సంతకం ఫోర్జరీ

సారంగాపూర్: బీర్‌పూర్ మండల పరిషత్ కార్యాలయంలో సూపరింటెండెంట్‌గా పనిచేస్తున్న రాజమౌళి ఎంపీడీవో సంతకాన్ని ఫోర్జరీ చేసినట్లు ఎంపీవో ఏవీకే రాజు సోమవారం ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేశారు. వివరాల్లోకి వెళ్తే.. బీర్‌పూర్ మండల పరిషత్ కార్యాలయంలో సూపరింటెండెంట్‌గా పనిచేస్తున్న రాజమౌళి ప్రతినెలా వేతనం పొందడానికి తన హాజరు సర్టిఫికెట్‌ను రాయికల్ మండల పరిషత్ కార్యాలయంలో అప్పగించాల్సి ఉంటుంది. జూన్‌నెల వేతనం పొందడానికి జూన్ 20న తన వేతన సర్టిఫికెట్‌ను అప్పగించాడు. జూన్ నెలలో తెలంగాణ దశాబ్ది ఉత్సవాల సమయంలో బీర్‌పూర్ ఎంపీడీవో మల్లారెడ్డి అనారోగ్యంతో జూన్ 23న మృతిచెందాడు. దీంతో ఎవరికీ వేతన సర్టిఫికెట్ జారీచేయలేదని ఎంపీవో పేర్కొన్నారు. దీనిపై జెడ్పీ చైర్‌పర్సన్‌తో పాటు, ఇతర ఉన్నతాధికారులకు, బీర్‌పూర్ పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేసినట్లు తెలిపారు. కాగా దీనిపై సూపరింటెండెంట్ రాజమౌళిని వివరణ కోరగా వేతనం పొందడానికి తాను ఎలాంటి సంతకాన్ని ఫోర్జరీ చేయలేదని, ఎంపీడీవో మల్లారెడ్డి ద్వారానే తాను ఈ వేతన సర్టిఫికెట్ పొందానన్నారు. ఆ తర్వాత వచ్చిన ఇన్‌చార్జి ఎంపీడీవో ద్వారా తాను మరో వేతన సర్టిఫికెట్‌ను రాయికల్ మండల పరిషత్ కార్యాలయానికి పంపించినట్లు చెప్పారు. ఈ విషయంలో సూపరింటెండెంట్, ఎంపీవో మధ్య సమన్వయం లేకే ఒకరికొకరు ఆరోపణలు చేసుకున్నట్లు పలువురు పేర్కొంటున్నారు.

దరఖాస్తుల ఆహ్వానం

జగిత్యాల: బెస్ట్ అవలెబుల్ స్కూల్ రెసిడెన్షియల్, నాన్ రెసిడెన్షియల్ పాఠశాలలో ఒకటి నుంచి ఐదో తరగతి వరకు ప్రవేశాల కోసం దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు జిల్లా షెడ్యూల్ కులాల అభివృద్ధి అధికారి రాజ్‌కుమార్ తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... 2023–24 సంవత్సరానికి గాను షెడ్యూల్ కులాల విద్యార్థులనుంచి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు పేర్కొన్నారు. ఒకటో తరగతిలో 75 సీట్లు, 5వ తరగతిలో 76 సీట్లు కేటాయించినట్లు తెలిపారు. 1వ తరగతి నాన్ రెసిడెన్షియల్ స్కీంలో ప్రవేశం పొందిన వారికి హాస్టల్ వసతి ఉండదన్నారు. జిల్లాకు చెందిన వారై ఉండాలని, వార్షిక ఆదాయం గ్రామీణ ప్రాంతాలవారికి 1.50 లక్షల్లోపు, పట్టణ ప్రాంతాల వారికి రూ.2 లక్షల్లోపు ఉండాలన్నారు. ఆసక్తిగల వారు ఈనెల 15లోపు దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. దరఖాస్తులు ఈనెల 3 నుంచి జిల్లా షెడ్యూల్ కులాల అభివృద్ధి అధికారి కార్యాలయంలో లభిస్తాయన్నారు. ఈనెల 20న విద్యార్థిని, విద్యార్థులను లాటరీ ద్వారా ఎంపికచేయనున్నట్లు పేర్కొన్నారు. మరిన్ని వివరాలకు 63028 82400 నంబర్‌లో సంప్రదించాలని కోరారు.

దాడి ఘటనలో ముగ్గురిపై కేసు

గోదావరిఖని(రామగుండం): స్థానిక అడ్డగుంటపల్లి సమీపంలోని రామాంజనేయ బార్ సమీపంలో బెంద్రం రాజిరెడ్డి, అతడి కుమారుడు కార్తీక్‌రెడ్డిపై దాడికి పాల్పడిన ముగ్గురిపై సోమవారం కేసు నమోదు చేసినట్లు వన్‌టౌన్ ఎస్‌ఐ స్వామి తెలిపారు. స్థానిక ఇందిరానగర్‌కు చెందిన మేకల పోచం, సంపత్, అనిల్ దాడికి పాల్పడ్డారని బాధితులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ పేర్కొన్నారు. ఇసుక ట్రాక్టర్ల రవాణా విషయంలో వాగ్వాదం జరిగి గొడవకు దారితీసినట్లు వివరించారు.